

అండర్-17 క్రికెట్‌కు శైలజ ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల జడ్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పాల శైలజ అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యిందని పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరావు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో ఇటీవల దేవరపల్లిలో జరిగిన అండర్-17 బాలికల క్రికెట్ పోటీలో ఉత్తమ ప్రతిభను చాటుకున్న శైలజ రాష్ట్ర స్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఆమెను హెచ్‌ఎంతోపాటు, వ్యాయమ ఉపధ్యాయులు గంగాధరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


శైలజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బిసి రుణాల కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

బిసి కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. రుణాలు మంజూరైతే ఏదైనా వ్యాపారం చేసుకొని స్వయం ఉపాధి పొందుదామని భావిస్తున్న దరఖాస్తుదారులకు సర్కారు నిర్లక్ష్యంతో నిరాశే ఎదురవుతోంది. దరఖాస్తులు సేకరించి 8 నెలలు కావస్తున్నా నేటికీ స్పందన లేకపోవటంతో దరఖాస్తుదారులలో తీవ్ర నిరాశ వ్యక్తమవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను స్వయం ఉపాధి యూనిట్ స్థాపించేందుకు దారిద్ర్యరేఖకు (బిపిఎల్)కు దిగువనున్న బిసిలలోని వివిధ కులాలతో పాటు, అగ్రవర్ణ పేదలు (ఇడబ్ల్యూఎస్) కమ్మ, రెడ్డి, ఇబిసి, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కులస్థులకు చెందిన 21-60 ఏళ్ల వయసు గల వారి నుంచి దరఖాస్తులు సేకరించింది. అదేవిధంగా డి-ఫార్మసి, బి-ఫార్మసీ పూర్తిచేసి ఉన్న బిసి, ఇడబ్ల్యూఎస్ నిరుద్యోగ యువత జనరిక్ ఫార్మసీల ఏర్పాటు నిమిత్తం, 21-50 సంవత్సరాల మధ్య వయసు ఉన్న (కాపు తెలగ, బలిజ, ఒంటరి) వారికి స్వయం ఉపాధి పథకం స్థాపించేందుకు సబ్సిడీతో కూడిన రుణాల మంజూరు చేసేందుకు అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దీంతో ఈ ఏడాది మార్చిలో అభ్యర్థులు అధికసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. బిసి స్వయం ఉపాధి పథకం కింద స్లాబ్-1 యూనిట్ విలువ రూ.2 లక్షల వరకు (50శాతం సబ్సిడీ, గరిష్ఠంగా రూ.75వేలు), స్లాబ్-2 యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు (50శాతం సబ్సిడీ, గరిష్ఠం రూ.1.25 లక్షలు), స్లాబ్-3 యూనిట్ విలువ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు (50 శాతం సబ్సిడీ గరిష్ఠంగా రూ.2 లక్షలు) మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాకు సంబంధించి 2,989 యూనిట్‌లకు గానూ రూ.54.12 కోట్ల మంజూరు చేసేందుకు ప్రతిపాదించారు. అలాగే స్వయం ఉపాధి పథకం ఇబిసి కమ్మ, రెడ్డి బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్యులకు 56 యూనిట్‌లకు గాను రూ.68 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. కాపు స్వయం ఉపాధి పథకానికి సంబంధించి 98 యూనిట్లకు గాను రూ.4.70 కోట్లు కేటాయించాల్సి ఉంది. బిసి రుణాల కోసం దరఖాస్తులు అందించి 8 నెలలు దాటుతున్నా ఇంకా మంజూరు కాలేదని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని పలు బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయినప్పటికీ నేటికీ రుణాలు వమంజూరు చేయలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని త్వరితగతిన మంజూరు చేసి స్వయం ఉపాధికి ప్రోత్సాహం కల్పించాలని జిల్లాలోని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



అధికారుల నుంచి సమాధానం లేదు

డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగిగా ఉన్నాను. స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో బిసి రుణాల కోసం దరఖాస్తులు సేకరించడంతో ఆశగా దరఖాస్తు చేశాను. అర్హుల జాబితాలో చోటు దక్కింది. ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యాను. ఆ తర్వాత పలు మార్లు బ్యాంకు వారిని కలిసినా ఫలితం లేదు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులను కలిసి రుణాల గురించి అడిగాను. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని సమాధానం ఇచ్చారు. త్వరిత గతిన రుణాలు మంజూరు చేసి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు కృషి చేయాలి.

- కె.పురుషోత్తం, దరఖాస్తు దారుడు, బిసి కార్పొరేషన్

బడ్జెట్ రిలీజ్ కాలేదు

బిసి కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాలకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వారిగా అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. యూనిట్ కాస్ట్, సబ్సిడీలతోపాటు అర్హుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వానికి దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిశీలన చేస్తుంది. దీని వల్ల రుణాల మంజూరు ఆలస్యమైంది.

- శ్రీనివాసులు, ఈడీ, బిసి కార్పొరేషన్


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కీర్తి చేకూరి

పిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రూరల్ మండలంలోని తొర్రేడు పిహెచ్‌సిని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆరోగ్య సేవల నాణ్యత, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, సకాలంలో నిర్వహించ వలసిన వైద్య పరీక్షలు, రికార్డుల నిర్వహణ, గర్భిణులు, పాలిచ్చే తల్లులు సేవల సమన్వయం వంటి అంశాలపై సిబ్బందికి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో వైద్యుల నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రతి చిన్నారి కోసం చైల్డ్ ట్రాకింగ్ రిజిస్టర్, హెల్త్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులకు పోషకాహారం, శిశు వికాసం, హెచ్చరిక సంకేతాలు, తక్షణ వైద్య సహాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి చిన్నారి హెల్త్ కార్డ్‌లో ఇమ్యూనైజేషన్, గ్రోత్, ఆరోగ్య వివరాలు సమయానుకూలంగా నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులు తమ మాతృగృహాలకు వెళ్తున్న సందర్భాల్లో సంబంధిత ఎఎన్‌ఎం, మెడికల్ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె.వెంకటేశ్వరరావు, సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తొర్రేడులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.

కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ప్రజాశకి - కొవ్వూరు

కొవ్వూరు డిగ్రీ కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయించి, తక్షణమే పనులు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తొలుత కళాశాల నుంచి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడారు. 2019లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. చుట్టుపక్కల గ్రామాలకి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా డిగ్రీ కళాశాల నడుస్తుందన్నారు. ఇక్కడే ఇంటర్, స్కూల్ ఉండటంతో ఒక పూట మాత్రమే కళాశాల జరుగుతుందన్నారు. తరగతి గదులు లేక విద్యార్థులకు ఇబ్బందులకు గురవుతున్నారనానరు. డిగ్రీ కళాశాలకు 2021లో 4.8 ఎకరాల స్థలం కేటాయించారన్నారు. కాని నేటికీ భవనం నిర్మించలేదన్నారు. నిధులు సైతం కేటాయించలేదన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి కళాశాల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, లోహిత్, మహేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నరన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని పందలపర్రులోని ఉమా మల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. దేవస్థానం ఛైర్మన్‌గా గొల్లపల్లి మురళీకృష్ణ, పాలకమండలి సభ్యులు భోగిరెడ్డి సుబ్బారావు, పులిమి సూర్యనారాయణ, సింగన పూడి మందేశ్వరరావు, అయినమిల్లి యేసు, గొలుగొండ వెంకటలక్ష్మి, తొంటపాక వెంకటలక్ష్మి, పుల్లేటికుర్తి కనకదుర్గ, కప్పల సుజాతలతో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నరసింహారావు, ఆలయ నిర్వహణ అధికారి సోమాల శివ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అత్తిలి వెంకటరామన్, అత్తిలి సోమశేఖర్, వీరన్న, మోహనరావు పందిరిపల్లి చిన్న మార్కండేయలు, మారిశెట్టి వీర వెంకటసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

హైస్కూల్ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెం జడ్‌పి హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థి, అమెరికాలోని బిఎండబ్ల్యూ కంపెనీలో పని చేస్తున్న కోనాల గౌరీశంకర్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. గురువారం స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజుకు చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్ గైడెన్స్ మీద దృష్టి పెట్టాలని సూచించారు. ఆయనను గ్రామ పెద్దలు ఉంగరాల రాము, సత్యం పెద్ద అబ్బులు, నారా ప్రసాద్, పెనుగొండ సత్యానందం, ఎస్ఎంసి ఛైర్మన్ గంటా శ్రీను, గులింకల నాని, ఉంగరాల ఆదివిష్ణు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో రూ.3.36 లక్షలను పాఠశాల పేరున ఎఫ్‌డిలు వేయటం జరిగిందని తెలిపారు.


చెక్కును అందిస్తున్న దాత గౌరీశంకర్


పిల్లలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీలక్ష్మి

బాలికల సదనాన్ని సందర్శించిన న్యాయమూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిచ, సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీలక్ష్మి గురువారం నగరంలోని ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శించారు. వసతులు, నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. సదనంలో ఉన్న విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడి వారి విద్య, బాగోగులు, వసతి ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. మంచి చదువుతో ఉన్నత స్థాయికి చేరుకుని భవిష్యత్తు నిర్మించుకునేలా క్రమశిక్షణ, సహనశీలత వంటి గుణాలను అలవర్చుకోవాలని ఆమె సూచించారు. మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, ఆహారపు మెనూ, నివాస వ్యవస్థ గురించి విద్యార్థినుల అభిప్రాయాలను సేకరించారు. ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా 15100 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం మానస ఆసుపత్రిని న్యాయమూర్తి సందర్శించారు. మానసిక చికిత్స పొందుతున్న రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రోగుల ఆరోగ్య పరిస్థితులు, వారికి అందుతున్న వైద్యం, ఆసుపత్రి సౌకర్యాలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. మానసిక రుగ్మతల నుంచి కోలుకున్నవారిని తిరిగి కుటుంబ సభ్యులతో కలపడానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.

1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఖరీఫ్‌లో జిల్లాలో సాగైయిన పంటలో 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటివరకూ సేకరించినట్లు సంయుక్త కలెక్టర్ వై.మేఘాస్వరూప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వరి సేకరణ అంచనా 4 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం నాటికి మొత్తం 34,737 కొనుగోలు కూపన్లు రైతులకు జారీ చేశామన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో ఏర్పాటు చేసిన 201 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 21,794 రైతుల నుంచి 1,61,611.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణయించిన 48 గంటల గడువులోపే మొత్తం 10,008 మంది రైతులకు రూ.172.85 కోట్లు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 157 రైస్ మిల్లులు ఈ కొనుగోలు ప్రక్రియలో పాల్గొంటున్నాయని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం తేమ వరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. సేకరణకు అవసరమయ్యే గోనె సంచులు జిల్లాలోని 212 ఆర్‌ఎస్‌కెల్లోనూ సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కామన్ వెరైటీకి రూ.2,389, గ్రేడ్ ఎ రకానికి రూ.2,369 చెల్లింపులు చేస్తున్నారని తెలిపారు. రైతుల తరపున ప్రభుత్వం ద్వారా చెల్లించబడే సేవల ప్రకారం గోనె సంచి వినియోగ ఛార్జీ ఒక్కింటికి రూ.4.74, హమాలీ ఛార్జీ క్వింటాకు రూ.22గా నిర్ణయించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు సంబంధిత ఫిర్యాదులు, సందేహాల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కంట్రోల్ రూమ్ ఉదయం 8.00 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు పని చేస్తుందని, రైతులు 8309487151 నంబర్‌కు సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు.

18 మంది డిప్యూటీ ఎంపిడిఒల నియామకం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 18 మంది డిప్యూటీ ఎంపిడిఒలను నియమిస్తూ గురువారం కలెక్టర్ కీర్తి చేకూరి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలో భాగంగా సచివాలయ పరిపాలనకు సంబంధించి నూతనంగా డిప్యూటీ ఎంపిడిఒలుగా నియమించారు. గామపంచాయతీలో ఎలాంటి కేసులు లేని సీనియర్ గ్రేడ్-1 కార్యదర్శులను, మండల పరిషత్‌లో పనిచేసే సీనియర్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతులు ఇచ్చి డిప్యూటీ ఎంపిడిఒలుగా అవకాశం ఇచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన 18 మందిలో 12 మంది తూర్పుగోదావరి జిల్లాలోనూ, మరో ఆరుగురు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వారు ఉన్నారు. జోన్ 2 పరిధిలో ఉన్న ఈ 18 మందిని తూర్పుగోదావరి జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. గోపాలపురం డిప్యూటీ ఎంపిడిఒగా ఆర్‌వి.సత్యనారాయణ, రంగంపేటకు ఎం.శ్రీనివాస్, నిడదవోలుకు టి.గోపాలకృష్ణ, తాళ్లపూడికి కెఎస్‌వివి.వీరన్న, నల్లజర్లకు కెవివి.రాంబాబు, కడియంకు ఎస్.శ్యాంప్రసాద్, కొవ్వూరుకు ఎం.ముత్యం, గోకవరంకు వి.శ్రీరామ్మూర్తి, రాజానగరంకు సిహెచ్.దేవదాసు, అనపర్తికి సిహెచ్.శ్రీశాస్త్రి, సీతానగరంకు మల్లిడి వెంకటరెడ్డి, బిక్కవోలుకు వై.మునేశ్వరరావు, కోరుకొండకు గుణ్ణం ప్రసాదరావు, దేవరపల్లికు కాయల వి.సత్యనారాయణ, రాజమహేంద్రవరం రూరల్‌కు దాసరి సూర్యనారాయణ, చాగల్లుకు పుల్లేటికుర్తి అచ్యుత రామకృష్ణ, పెరవలికి కొవ్వూరి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు.


సత్యదేవ నర్సరీలో ఒడిశా బృందం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపు లంక సత్యదేవ నర్సరీని ఒడిసా రాష్ట్రానికి చెందిన జడ్‌పి ఛైర్మన్, సర్పంచ్, ఎన్నికల అధికారుల బృందం గురువారం సందర్శించింది. నర్సరీ రైతు పుల్లా పెద్ద సత్యనారాయణ వారికి మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ఇక్కడి మొక్కలు ప్రకృతిలో సంభవిస్తున్న కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రిస్తున్నాయని వారికి వివరించారు. నర్సరీలో పలు రకాల మొక్కల శాస్త్రీయ నామాలు, వాటివల్ల ఉపయోగాలను వారు అడిగి తెలుసుకున్నారు. వివిధ పండ్ల జాతి మొక్కలతో పాటు సప్త వర్ణ దళాలు, పుష్పాలు చూపరులను కనువిందు చేస్తున్నాయన్నారు. మొక్కలను పరిశీలించి ప్రపంచంలో గల వింతైన మొక్కలు ఉత్పత్తి చేస్తున్న సత్యదేవ నర్సరీ రైతు పుల్లా పెద్ద సత్యనారాయణను బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో ఎస్.భాస్కర్‌నాయక్, కితీష్ మిశ్రా, సోవురవ్ కుమార్, పుల్లా రామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఒడిసా బృందానికి వివరిస్తున్న నర్సరీ రైతులు

కార్టూ'నిజం'



బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లపూడి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు మంచిగా ఉండాలంటే అది తల్లి పర్యవేక్షణతోనే సాధ్యమని అన్నారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వీటిని చేస్తున్న వ్యక్తులు ఎంతటి వారైనా ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి, సిడిపిఒ నాగలక్ష్మి, ఎంఇఒ బాలమణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ భాగ్య కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలపై అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని కిశోర బాలికలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.పద్మావతి, జి.శిరీష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సోషల్ వర్కర్ కె.రాజు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఇందిరారాణి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రాజమనోహర్, ఎంఇఒ జి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సృజని, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రమణ, విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గోపాలపురంలో అవగాహన ర్యాలీ


రైతులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ తాతారావు

డ్రం సీడింగ్ టెక్నాలజీతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెరవలి

డ్రం సీడింగ్ టెక్నాలజీతో అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు అన్నారు. గురువారం మండలంలోని ముక్కామల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఎడిఎ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రం సీడింగ్ టెక్నాలజీ ద్వారా పంటలను సాగు చేయడంతో పంటల దిగుబడి పెంచవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు విధానం ఆరోగ్యకరంగా ఉంటుందని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో దాళ్వా పంట డ్రమ్ సీటింగ్‌లో సాగు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మేరీ కిరణ్, జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, రైతులు సూర్యనారాయణ, రాముడు, వెంకటకృష్ణ, ముత్యాలు పాల్గొన్నారు.

29న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ డిఇఇ వి.రవిశంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మతులు, ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్స్ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గోపాలపురం సబ్‌స్టేషన్‌లోని 11కెవి, గోపాలపురం టౌన్ ఫీడర్, 11కెవి గోపాలపురం రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. గోపాలపురం రూరల్ ఫీడర్ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మోర్త, ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మోర్త పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులచే మాక్ అసెంబ్లీని నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలో విజేతలకు పిఎసిఎస్ ఛైర్మన్ కరుటూరి వెంకటదొరప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిటికిన కృష్ణ, మడిచర్ల సురేంద్ర, సిఇఒ పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్‌పిటిసి, టిడిపి నాయకుడు డాక్టర్ పాలూరి బోసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ఏడుగురు కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు లభించాయి. తాళ్లపూడి, అన్నదేవరపేట, పెద్దేవం పంచాయతీ కార్యదర్శులు ఎస్. వీరన్న, డి.శ్రీనివాస్, సాంబమూర్తి జిఎస్‌డబ్ల్యూఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ప్రక్కిలంక కార్యదర్శి నందిరాజు గ్రేట్ 2 కార్యదర్శిగా, మలకపల్లి, పోచవరం, తిరుగుడుమెట్ట కార్యదర్శులు కామేశ్వరి, రామలక్ష్మి, సుభద్ర గ్రేడ్-1 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు పొందారు. జిఎస్‌డబ్ల్యూఎస్‌గా ఉద్యోగోన్నతి పొందిన తాళ్లపూడి కార్యదర్శి వీరన్న డిప్యూటీ ఎంపిడిఒగా నియమితులయ్యారు.

వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం దేవస్థానం అధికారుల సమక్షంలో లెక్కించారు. 41 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.6,02,141, అన్నదాన హుండీ ద్వారా రూ.7910 మొత్తం రూ.6,10,051 హుండీ ఆదాయం వచ్చింది. బంగారం 11 గ్రాములు, వెండి 150 గ్రాములు వచ్చిందని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం. రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామస్తులు, సేవకులు పాల్గొన్నారు.

నిడదవోలులో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - నిడదవోలు, బిక్కవోలు

నిడదవోలు పట్టణంలోని 14 వార్డులో పట్టణ అధ్యక్షులు కామిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బిర్రె పార్వతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బిక్కవోలు మండలంలోని పందలపాకలో వైసిపి మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని సత్తి హరిప్రసాద్ రెడ్డి, కర్రి ఇస్రారెడ్డి, బొడ్డు ముత్యాలరావు, రొంగల వెంకటేశ్వరరావు, తమలంపూడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని గౌరిపల్లి గ్రామంలో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి రైతులకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. రైతు క్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

యువతి అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చేబ్రోలు ఒక ప్రైవేటు కాలేజీలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం చెందిన త్రిపుర సాయి తులసి బుధవారం పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి కాలేజీకి వచ్చింది. పరీక్ష అనంతరం ఇంటికి రాలేదు. దీంతో యువతి తల్లి మహాలక్ష్మి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి - కరప

వేళంగి గ్రామంలో 2024లో వద్ధురాలిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించిన కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి దోషికి ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. 80 ఏళ్ల వృద్ధురాలిపై నొక్కు వెంకటరమణ అత్యాచారయత్నం చేశారు. దీనిపై అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అతడిపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం కోర్టులో జడ్జి వై.బెన్నయ్య నాయుడు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు.



ధర్నా చేస్తున్న యూనియన్ కార్మికులు

లేబర్ కోడ్‌ల రద్దు కోసం ధర్నా

ప్రజాశక్తి - కొవ్వూరు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు అన్నారు. గురువారం స్థానిక కోరమండల్ కాంక్రీట్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద నాలుగు లేబర్ కోడ్స్ అమలు ఉత్తర్వుల ప్రతులను కోరమండల్ కాంక్రీట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యూనియన్ కార్యదర్శి బీరా రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తీసుకొచ్చారని అన్నారు. ఖచ్చితంగా కార్మిక లోకం వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరాడ రామకృష్ణ, బట్టు సాంసంగ్, టి.రాంబాబు, పి.పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఆర్ట్స్ కళాశాలలో గురువారం 'యువ నాయకత్వం' అనే అంశంపై సదస్సు ప్రారంభం అయింది. తత్వశాస్త్ర విభాగం, కన్యాకుమారికి చెందిన వివేకానంద కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సును వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామమూర్తి, తత్వశాస్త్ర విభాగం ఇన్‌ఛార్జ్ డాక్టర్ కస్తూరి సీతా మహాలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమంలో విద్యార్థులు ఏకాగ్రత, వ్యక్తిగత గోప్యత, సమష్టి కృషి, శారీరక దృఢత్వం మెరుగుదల వంటి అంశాలపై చర్చించారు. ప్రారంభ సభలో అధ్యాపక సభ్యులు సయ్యద్ ఫర్హా యస్రూన్, సత్యం సూర్యనారాయణ, ముప్పిడి మహేష్, వివేకానంద కేంద్ర సభ్యులు శ్రీనివాస్, వెంకటకృష్ణ, రవి, నూజిల్లా రామసుబ్రమణ్యం, ఎ. రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

తొర్రేడులో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రూరల్ మండలం తొర్రేడులో రైతన్నా మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొని వరి సాగు లాభాలపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహనతోపాటు, పంట మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. రబీ సీజన్‌లో ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు లాభం వస్తుందని, ఖరీఫ్‌లో పెట్టుబడి తిరిగి వస్తోందని రైతులు వివరించారు. ప్రస్తుతం ఎకరాకు 3 నుంచి 6 బస్తాల యూరియా వినియోగంలో ఉందని చెప్పిన రైతులకు, యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువుల సక్రమ వినియోగం అవసరమని కలెక్టర్ సూచించారు. అనంతరం మిర్తిపాడు గ్రామంలో కళ్లాల్లో నిలువ సమస్యలు, పంట ఎదుగుదల వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, సహాయ సంచాలకులు రమేష్, రైతులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లు ఆందోళనకరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు ఆందోళనకరమని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథిగృహంలో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిపై రాజకీయ ఒత్తిడులు, అనుచిత ప్రవర్తనల వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి నుంచి వైద్య ఆరోగ్య శాఖను రక్షించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. వేలాదిమంది రోగులకు రాత్రిపగలు తేడా లేకుండా సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది యొక్క మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా పరిస్థితి ఉందన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వాస్తవాలు సేకరించి, సమగ్ర విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, వాస్తవాల నిర్ధారణ లేకుండానే ఆరోగ్య సిబ్బందిపై చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, కమల్‌సుందర్, ఎ.శ్రీనివాసరావు జాయింట్ సెక్రటరీ దినేష్, గోపాలకృష్ణ, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ఛైర్మన్ వి.రామదాసు, కన్వీనర్ సుధాకర్, మహిళా విభాగం నాయకులు జి.అనిత, ఎం.ఇందిరా, అంజలిశ్రీ, వాణి, మధులత, మాధవి పాల్గొన్నారు.

తాగు నీరు రాదు... మురుగు నీరు పోదు

చిలకపాడు జగనన్న కాలనీవాసుల గోడు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్రంలో సొంతిల్లు లేక ఇబ్బంది పడుతున్న పేదల కోసం గత వైసిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించి జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఏర్పాటైంది మండలంలోని చిలకపాడు జగనన్న కాలనీ. 2020లో కాలనీకి శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో 32 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. వారిలో 23 మంది పక్కా గృహాలను నిర్మించుకున్నారు. మిగిలిన వారు ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లను నిరించుకోలేకపోయారు. కాలనీలో సుమారు 100 మంది వరకూ జీవస్తున్నారు. ఈ కాలనీ ఏర్పడి ఐదేళ్లు దాటిందని, ఇప్పటికీ వసతుల లేమితో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు పాలా వరలక్ష్మి, దొంగర లక్ష్మి, చింతపల్లి నాగలక్ష్మి, షేక్ భాషా, షేక్ ఖాసిం వల్లి, గుమ్మళ్ళ ఆదిలక్ష్మి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వసతి కూడా నేటికీ లేదన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు పథకం పనులు ప్రారంభించారన్నారు. దీంతో తాగునీటి సమస్య తీరుతుందని ఆనందపడ్డామన్నారు. అయితే ఇళ్ల వద్దకు పైపులు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారని తెలిపారు. దీంతో నేటికీ తాగునీరు అందట్లేదని వాపోయారు. దీంతో బయట నుంచి తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సివస్తుందన్నారు.



జల్‌జీవన్‌లో భాగంగా వేసిన పైపులు

రోడ్లపైనే మురుగునీరు

కాలనీ మొత్తం మురుగుకూపంగా దర్శనమిస్తుంది. ఇక్కడ డ్రెయినేజీ సదుపాయం లేదు. ఐదేళ్లయినా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల వద్ద వాడకపు నీరు వెళ్లేందుకు ఎవరికి వారు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకున్నారు. ఇవి నిండిపోవడంతో మురగునీరు రోడ్లపైకి చేరుతుంది. దీంతో నిత్యం వీధుల్లో మురుగు పారుతోంది. కాలనీ మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. ఎక్కడ చూసినా దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల దాడికి రాత్రి వేళల్లో కంటిపై కునుకు ఉండట్లేదని స్థానికులు చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీకి మరోపక్క పంటపొలాలు ఉండటంతో కాలనీలోకి విష సర్పాలు, విష పురుగులు వంటివి తరచూ వస్తున్నాయి. జెర్రిలు, తేళ్లతో సవాసం చేయాల్సి వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక వర్షం వస్తే కాలనీ పరిస్థితి మరింత ఆధ్వానంగా ఉంటుంది. చిన్నపాటి వర్షానికే మోకాళ్లలోతు నీరు రోజులతరబడి నిలిచిపోతోంది. ఇందులోనే కాలనీవాసులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి.



నిరుపయోగంగా ఉన్న కుళాయిలు



చిలకలపాడు జగనన్న కాలనీ వాసులు

కాలువ ముంపుతో ఇబ్బందులు



కాలువ ముంపుతో తరచూ ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వంలో కాలువ ముంపు నివారణకు ప్రహరీ కట్టిస్తామని అప్పటి ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. కాని నేటికీ ఆ హామీ అమలు కాలేదు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు తమ సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు.

- గుమ్మళ్ల ఆదిలక్ష్మి. చిలకలపాడు జగనన్న కాలనీ

రోడ్ల పరిస్థితి మరింత దారుణం



కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. మురుగునీరు కూడా రోడ్లపైనే ప్రవహించడంతో కనీసం నడిచే వీలు కూడా లేదు. పాములు, విష పురుగులు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి వేళల్లో చిన్నారులతో బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తుంది.

- దొంగర లక్ష్మి. చిలకలపాడు జగనన్న కాలనీ

సమస్యలను పరిష్కరించాలి



కాలనీలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. తాగునీటి వసతి లేదు. కాలువ నీటితో తరచూ ముంపు సమస్య తలెత్తుతుంది. పాముల బెడదతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. దోమలు, ఈగలతో కంటిపై కునుకు ఉండట్లేదు. ఎప్పుడు ఏ రోగం వస్తుందోనని ఆందోళనలో బతకాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి. మా సమస్యలను పరిష్కరించాలి.

- షేక్ ఖాసీం వలీ. చిలకలపాడు జగనన్న కాలనీ

మద్దూరులోనే ఇళ్ల స్థలాలు ఇప్పిస్తా...

సర్పంచ్ ఉప్పులూరి మునిరాజేంద్రప్రసాదరావు

ప్రజాశక్తి - కొవ్వూరు

మద్దూరు వాసులకు మద్దూరులోనే ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని సర్పంచ్ ఉప్పులూరి మునిరాజేంద్రప్రసాదరావు(బాబ్జి) అన్నారు. వైసిపి హయాంలో కొవ్వూరు పట్టణ శివారు నందమూరు రోడ్డులో 145 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. గ్రామానికి సుమారు పది కిలోమీటర్ల దూరంలో ఉండడంతో గ్రామస్తులు అక్కడికి వెళ్లడానికి నిరాకరించారు. ఐదేళ్ల కాలంలో గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇళ్ల పట్టాలు తీసుకున్నారు తప్ప ఒకరు కూడా కొవ్వూరులో కేటాయించిన స్థలాలను స్వీకరించలేదు. ఏ ఒక్కరూ ఇల్లు నిర్మాణం చేపట్టకపోవడంతో ఐదేళ్లుగా స్థలాలు ఖాళీగానే ఉంటున్నాయి. తమ గ్రామ పరిధిలోనే ఇళ్ల స్థలాలివ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ బాబ్జి చొరవ తీసుకుని స్థానికంగానే ఇళ్ల స్థలాలు కేటాయించే దిశగా చర్యలు చేపట్టారు. సమస్యను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి స్థానికంగా స్థలాలు సేకరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం పట్టాలు పొందిన మహిళల నుంచి కొవ్వూరులో కేటాయించిన స్థలాలను రద్దు చేయాలని కోరుతూ డిక్లరేషన్ స్వీకరించారు. వీరందరికీ కొవ్వూరులో స్థలాలు కేటాయించడంతో మద్దూరులో కేటాయించే అవకాశం లేదు. దీంతో గతంలో తీసుకున్న పట్టాలను రద్దు చేయాలని కోరుతూ లబ్ధిదారులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. వీటిని అధికారులకు అందించామని బాబ్జి తెలిపారు. రద్దు చేసిన తరువాత లబ్ధిదారులకు గ్రామ సమీపంలో అనువైన స్థలాలను కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామన్నారు. ఎంఎల్ఎతో పాటు కలెక్టర్, అధికారులు గ్రామ సమీపంలో ఇళ్ల స్థలాలకు అనువైన స్థలాలను పరిశీలించారన్నారు.



డిక్లరేషన్ ఫారాలు ఇస్తున్న మద్దూరు గ్రామ మహిళలు

రోడ్లు, తాగునీటి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

సంక్రాంతి నాటికి రోడ్లు, తాగునీటి పనులను పూర్తి చేయాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. గురువారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో పుష్కరాల నేపథ్యంలో నియోజకవర్గంలో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్షించారు. రానున్న సంక్రాంతి పండుగ నాటికి నియోజక వర్గంలో ప్రతిపాదించిన రోడ్లు, మంచి నీటి సరఫరా పనులన్నింటినీ పూర్తి చేయాలని అన్నారు. 2027 పుష్కరాల కోసం అవసరమైన రోడ్ల ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫ రాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల పనులు వారం రోజుల్లోగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బూరుగు పూడి, మునగాల, దోసకాయలపల్లి, కోటి కేశవరం, నరసాపురం, జంబూపట్నం గ్రామాలలో చేపట్టిన మంచి నీటి సరఫరా పనులను వేగవంతం చేయా లని ఆదేశించారు. దివాన్ చెరువు, తోకాడ, మల్లం పూడి, ముక్కినాడ గ్రామాలలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉప ఆలయాల శిఖర ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చివటం పిఎసిఎస్ అధ్యక్షులు ముళ్ళపూడి పాండురంగ, ఎంపిటిసి వివి.సత్యనారాయణ, జనసేన నాయకులు మంత్రిని కలసి తీపర్రు-వడ్లూరు రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల నుంచి సొసైటీ వరకు బిటి రోడ్డుకు బదులు సిసి రోడ్డు నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.



పదక్షిణ చేస్తున్న మంత్రి దుర్గేష్, తదితరులు

లబ్ధిదారుల అర్హతపై సర్వే తప్పనిసరి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పొందిన లబ్ధిదారుల అర్హతపై తప్పనిసరిగా సర్వే నిర్వహించాలని దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకట సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2008లో నాటి ప్రభుత్వం 72 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. ఆ స్థలాలు నిర్మాణాలకు అనువుగా లేనందున అప్పట్లో గ్రామంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదన్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం వారిలోని 35 మంది లబ్ధిదారులను తొలగించి, కొత్త వారికి మంజూరు చేయించారన్నారు. వీరిలో పలువురు అనర్హులు కాగా, రెండు మూడు కోర్టు కేసులు నడుస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ స్థలం సర్వే చేయించి, స్థలాలు అందించనున్నట్లు హౌసింగ్ ఎఇ తెలిపారని, తక్షణమే ఈ చర్యను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరహారదీక్ష చేస్తానని హెచ్చరించారు.

యశోదలో విజయవంతంగా డిబిఎస్ శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న న్యూరోజనరేటివ్ వ్యాధులలో ఒకటైన పార్కిన్సన్ వ్యాధి(వణుకు) నివారణకు డిబిఎస్ శస్త్ర చికిత్సలు యశోదా ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించామని యశోద హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, పిడిఎండిఆర్‌సి క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రుక్మిణిమృదుల కందాడై తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలో యశోద మెడికల్ సెంటర్లో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలో ప్రతి లక్ష మందిలో 42 శాతం నుంచి 60 శాతం మంది పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి బిపి, మధుమేహం తరహాలో జీవితాంతం కొనసాగుతుందన్నారు. మొదటి 3 నుంచి 4 సంవత్సరాలు మందులతో మెరుగుదల కనిపించినప్పటికీ తరువాత వాటి ప్రభావం తగ్గిపోతుందన్నారు. ఇటువంటి దశలో ఎఫ్‌డిఎ అండ్ డిసిజిఐ అంగీకరించిన ఏకైక ఆధునిక చికిత్స డిబిఎస్ (డీప్ బ్రెయిన్ స్టిములేషన్) అన్నారు. ఇటీవల హుజురాబాద్‌కు చెందిన అశోక్‌రెడ్డి, కాజీపేటకు చెందిన సంగీత పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతూ యశోద హాస్పిటల్ హైటెక్ సిటీలో చికిత్స పొందారన్నారు. వారికి డిబిఎస్ చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఎలక్ట్రోడ్‌ను మెదడులోని నిర్దిష్ట భాగంలో అమర్చడం, వాటిని ఛాతి ప్రాంతంలో అమర్చే చిన్న పరికరంతో అనుసంధానం చేయడం ద్వారా కంపనలు, గట్టితనం, నడక, శరీర సమతుల్యత సమస్యలు గణనీయంగా తగ్గుతాయన్నారు. ఈ సమావేశంలో డిజిఎం సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాలవీరభద్ర, మార్కెటింగ్ మేనేజర్ షరీఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రుక్మిణిమృదుల

యాన్యువల్ యాక్షన్ ప్లాన్‌పై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం యాన్యువల్ యాక్షన్ ప్లాన్-2 తయారీ కోసం 4 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎపిఎం జిలానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో 8 కీలక అంశాలపై దృష్టి సారించి ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సంపద సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుస్థిర జీవనోపాదులు, సామాజిక భద్రతపై అవగాహన కల్పించారు. ఈ అంశాల ఆధారంగా రాబోయే సంవత్సర కాలంలో తమ పరిధిలోని గ్రామ సంఘం సభ్యులకు ఏఏ అవసరాలు ఉన్నాయో అంచనా వేసి, సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు కందికట్ల అరుణకుమారి, కార్యదర్శి రొంగలి దుర్గాదేవినాయుడు, సిసి హరిబాబు, లక్ష్మీ, వెంకటలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

మంచిరాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి మంచిరాజు సీతారామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబ సభ్యులు మంచి రాజు రామకృష్ణారావు, మంచిరాజు శ్రీనివాస్‌లను మాజీ ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు, ఎంపిపి కార్చెర్ల సీతారాంప్రసాద్ గురువారం పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పెరవలి

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలంలోని కానూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ భావన మధుపూర్ణ పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటి కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చివటం ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 13 మందికి కళ్లజోళ్లు అవసరమని కంటి వైద్య నిపుణులు జెఎన్ఆర్.మిల్టన్ గుర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి శక్తి నిచ్చే ఆహారం తీసుకోవాలని, కంటికి అధిక శ్రమ కల్పించ రాదని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఏడుకొండలు, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ కె.విజయ్ కుమారి, ఎఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపికకు పలువురి అభినందనలు

ప్రజాశక్తి -పెరవలి

మండలంలోని ఖండవల్లి గ్రామ జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి పమ్మి దీపికను పలువురు అభినందించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో దీపిక చేసిన ఉత్తమ ప్రదర్శన పట్ల మంత్రి కందుల దుర్గేష్, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, టిడిపి, జనసేన మండల అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవికుమార్, సర్పంచ్ పులిదిండి నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం పి. పద్మప్రియ అభినందించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అవర్చుకోవాలని రాజమహేంద్రి మహిళ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మున్సిపల్ కాలనీలోని రత్నంపేటలో గురువారం ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తేతలి సత్యసౌందర్య, ప్రిన్సిపల్ ఎంకెఎస్. ప్రసాద్, సత్య సాయి సేవ సమితి సభ్యులు కెటిఎస్.మూర్తి, ఎస్‌వివి సుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడారు.

CHANGE OF NAME

I, undersigned **YADLAPALLI NITISHA** (Old Name) W/o Yadlapalli Karuna Kumar,plot no.9,sector 2, road no.1,sub-ham county park,turangi,kakinada-533016, Andhra Pradesh changing my name from **YADLAPALLI NITISHA** (Old Name) to **AKOJU NITISHA**(New Name) shall hence forth I am being called as **AKOJU NITISHA** (New Name) W/o Yadlapalli Karuna Kumar for all purposes

IN THE COURT OF THE 4th ADDITIONAL JUNIOR CIVIL JUDGE, KAKINADA
O.S.No.860/2021

Between:-
State Bank of India, Personnel Banking Branch Kakinada Through its Stressed Assets Resolution Centre (SARC) at Kakinada Rep by its Asst General Manager Kakinada. ...Plaintiff
And
Badugu Raj Kumar and another ...Defendants

To. Defendant.2
Badugu Sita MahaLakshmi,W/o. (late) Raj kumar, D.No.1-364/2, Rayudu palem, Opp M.P.P.School, Ramanayyapeta, Kakinada-533005.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.11-12-2025సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10.30ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
K.V.S.Ramana Murthy
Advocate, D.No.7-8-12
Ramaraopeta, Kakinada.
Cell.9848502492

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు : కాకినాడ
I.A.489/2023, O.S.24/2023
Between:
గుండారపు వెంకట్రావు, వగైరాలు ..పిటీషనర్లు / ప్లెయింటిఫ్స్
మరియు
దేవగుప్తపు సూర్యనారాయణ @బాబురావు, వగైరాలు ...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు
R1 : దేవగుప్తపు సూర్యనారాయణ @ బాబురావు, S/o. లేటు సత్తియ్య, డోర్.నెం.9-73, చాకలిపేట, శివాలయం ప్రక్కన, పెదపూడి, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబర్ దావాలో 1వ ప్రతివాది అయిన దేవగుప్తపు సూర్యనారాయణ@బాబురావు మరియు వారి కుమారుడైన దేవగుప్తపు గోపాలం వారి జాయింటు కుటుంబ అవసరాల నిమిత్తం వాదుల వద్ద సొమ్ములు బదులు పుచ్చుకొని సదరు బాకి సొమ్ములు ఎగవేయుటకు వారి తాలుకు ఆస్తులకు తప్పుడు దస్తావేజులు సృష్టించియున్నారు. సదరు దస్తావేజులు రద్దుపరచి వాదులకు రావలసిన బాకి సొమ్ములు వసూలు ఇప్పించవలసిందిగా రిప్రజెంటేటివ్ కెపాసిటీలో వాదులు వారి తరుపున, దేవగుప్తపు సూర్యనారాయణ @ బాబురావు మరియు దేవగుప్తపు గోపాలం, గార్ల జాయింటు కుటుంబ బాకీ దార్ల తరుపున, కూడా దాఖలు చేసియున్నారు. పై దావాలో దేవగుప్తపు సూర్యనారాయణ@ బాబురావు మరియు వారి జాయింట్ కుటుంబ సభ్యుల నుండి ఎవరికి ఏవిధమైన బాకీలు ఉన్న యెడల, పైన తెలిపిన కోర్టులో **ది.08-12-2025 తేదిన ఉదయం గం 10.30 ని॥లకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను.

|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
కాకినాడ. #12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
ది.27-11-2025 Cell: 9848314081

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ
I.A.1530/2025, O.S.920/2025
Between:
ఒబిలిశెట్టి వెంకటరత్నం ..పిటీషనర్ / ప్లెయింటిఫ్
మరియు
చెక్క వీరవెంకట సత్యన్నారాయణ ...రెస్పాండెంటు / డిఫెండెంట్
రెస్పాండెంట్/డిఫెండెంట్
చెక్క వీరవెంకట సత్యన్నారాయణ,
S/o.నాగేశ్వరరావు,డోర్.నెం.4-19-56/38/1/1, ఐశ్వర్య నగర్, నారాయణ స్కూల్ వెనుక ప్రక్కన, మండపేట టౌన్-533308, మండపేట మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పై నెంబర్ **I.A.No.1530/2025** జప్తు పిటీషన్ లోనూ మరియు పై దావా లోనూ మీరు రెస్పాండెంట్/డిఫెండెంట్ అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు మరియు సమన్లు పంపిననూ తీసుకోకుండా కాలయావన చేయుచున్నారు. పైన తెలిపిన పిటీషన్ మరియు దావా **ది.02-01-2026 తేదిన వాయిదా** అయ్యివున్నది. కావున పై తేదిన పైన తెలిపిన కోర్టులో మీరు హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై పిటీషన్ మరియు దావా మీ పరోక్షమున తీర్మానించబడుననియు ఇందుమూలముగా తెలియపరచటమైనది.

|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
కాకినాడ. #12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
ది.27-11-2025 Cell: 9848314081

ప్రకటన

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, మాగం గ్రామ కాపురస్తులు నక్కా సరస్వతి (లేటు) W/o(లేటు) నక్కా చంద్రరావు గారికి చెందిన డాక్యుమెంటు నెంబర్ 3033/1979, సర్వే నెంబర్ 11-5 గల 0.52 సెంట్లు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు పడిపోయినవని. అయినవిల్లి పోలీస్ స్టేషన్ నందు కంప్లైంట్ ఇచ్చి ఉన్నారు. అలాగే పేపర్ యందు ప్రకటన ఇచ్చి ఉన్నారు. సదరు భూమిపై లోన్ ఇచ్చుటకు అభ్యంతరం లేదు. దీనిపై ఎవరైనా అభ్యంతరములు ఉన్నచో పది రోజుల్లోగా అయినవిల్లి మండలం NOB 569 మాగం పిఎసిఎస్ నందు తెలుపగలరు.

వి.శ్రీనివాస్, సీఈఓ
NOB 569, మాగం పిఎసిఎస్, అయినవిల్లి మండలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా - 533577 సెల్ :9391384559

ఒరిజినల్ దస్తావేజు పోయినది

ఆరేపల్లి నాగరాజు తండ్రి వెంకన్న రాజమండ్రి తూర్పుగోదావరిజిల్లాలో నివసిస్తున్న నాయొక్క ఒరిజినల్ **దస్తావేజు నెం.657/2004 ది.04-03-2004** S.R.O. కొవ్వూరు నెంబర్లు గల ఒరిజినల్ దస్తావేజు **ది.20-11-2025వ** తేదిన నేను కొయ్యలగూడెం బస్‌స్టాండ్ సెంటర్ నుండి జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంతవెతికినా కనిపించలేదు. సదరు దస్తావేజ్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నెంబరుకి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను

ఆరేపల్లి నాగరాజు
9849446976

మహారాజశ్రీ ఎంప్లాయిస్ కాంపెన్సేషన్ కమీషనర్ కోర్టు, గుడివాడ వారి వద్ద
ఇ.సి.నెం. 05/2024
బిట్విన్:
మండపాటి బేబి కృష్ణవేణి ... పిటిషనర్
మరియు
వర్రే భిక్షం మరియొకరు ... రెస్పాండెంట్స్

పైన తెలిపిన కేసులో 1వ ప్రతివాది అయిన వర్రే భిక్షం S/o వీరమల్లు, డోర్ నెం.1-42/3, తిమ్మాపురం, కిర్లంపూడి, తూర్పుగోదావరి వారి యొక్క హాజరు నిమిత్తం సదరు కోర్టువారు ది. 16-12-2025 వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వర్రే భిక్షం గారు ది. 16-12-2025 వ తేదిన సాయంత్రం 3 గంటలకు, విజయవాడ లోని, గవర్నర్‌పేట లోని లేబరు కోర్టులో గల గుడివాడ ఎంప్లాయిస్ కాంపెన్సేషన్ కమీషనర్ గారి కోర్టులో హాజరై వారు తెలుపుకొనునది ఉన్నాయడల తెలుపుకోనగలరు వారుగాని, వారి యొక్క లాయర్ గారు గాని రానియెడల, వారి యొక్క పరోక్షంలో సదరు కేసులో తీర్పు చెప్పగలరు.

కోర్టు వారి ఆర్డరుపై ఇచ్చిన నోటీసు
వాయిదా తేదీ : 16-12-2025
సాయంత్రం 3 గ॥లకు
ఇట్లు
సుధాకరరావు ఆలూరి
అడ్వకేట్, విజయవాడ
సెల్ నెం. 9392133535